క్లుప్తంగా

శ్రీనివాసా.. గోవిందా



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

పెరవలి: మార్గశిర మాసంలోని శనివారం కావడంతో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. వేలాదిగా భక్తులు రావడంతో స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. వందలాది మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. దాతల సహాయంతో సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. ప్రతి శనివారం భక్తులకు ఉచిత అన్న సమారాధన చేస్తున్నామని, ప్రసాదాలు కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ఆలయ కార్య నిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ తెలిపారు.

నేడు చండీ హోమం

కొవ్వూరు: పౌర్ణమి సందర్భంగా ప్రతి నెలా నిర్వహించే చండీహోమాన్ని ఈనెల 15న స్థానిక గోష్పాద క్షేత్రంలోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో నిర్వహించనున్నట్టు ఆత్మీయ హితకారిణీ సమాజం సభ్యులు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి వివిధ రకాల పూజలు ప్రారంభం అవుతాయన్నారు.

నేడు గుంటూరులో మాలల మహాగర్జన సభ

కొవ్వూరు: ఈనెల 15న గుంటూరులో నిర్వహించే మాలల మహా గర్జన సభను విజయవంతం చేయాలని మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాశ్ కోరారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటో తేదీన సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఈ గర్జన సభ నిర్వహిస్తున్నామన్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి విఘాతం కలిగిస్తూ ఈ తీర్పు ఇచ్చారని ఆయన ఆరోపించారు. రాజ్యాంగంలో ఎక్కడా క్రీమీలేయర్ అనే పదమే లేదని, అస్పృశ్యత ఆధారంగా ఏర్పడిన రిజర్వేషన్‌ను తీసే అధికారం సుప్రీం కోర్టుకు లేదని పేర్కొన్నారు. ఈ తీర్పుపై దేశ వ్యాప్తంగా ఆందోళనకు సిద్ధంగా ఉన్నామని రవి ప్రకాశ్ ప్రకటించారు.

నల్లజర్లలో ఉచిత వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వెన్నెముక వైద్య నిపుణుడు తేజో ఫణీంద్ర

నల్లజర్ల: అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో శనివారం నల్లజర్లలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 134 మంది రోగులను పరీక్షించారు. ఆసుపత్రుల్లో రూ.2500 తీసుకుని నిర్వహించే ఎముకల సాంద్రత పరీక్షను ఈ శిబిరంలో ఉచితంగా చేశారు. రాజమహేంద్రవరం వేద హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ వెన్నెముక వైద్య నిపుణులు తేజో ఫణీంద్ర ఈ సందర్భంగా రోగులకు పలు సూచనలు చేశారు. అపోలో ఫార్మసీ ఎగ్జిక్యూటివ్ శివకృష్ణ, వేద హాస్పిటల్ మేనేజరు పి.పెద్దిరాజు, అపోలో సీనియర్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, స్వర్ణ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు



అనంతపల్లి శివార్లలో డివైడర్‌ను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

నల్లజర్ల: అనంతపల్లి శివారు ఎర్ర కాలువ బ్రిడ్జి సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద శనివారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డివైడర్‌ను ఢీ కొట్టింది. ఆ సమయంలో నిద్రలో ఉన్న ప్రయాణికులు ఏం జరిగిందో తెలియక హాహాకారాలు చేశారు. బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. విజయనగరం నుంచి హైదరాబాదు వెళుతున్న ఈ బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రయాణికులను వేరే బస్సులో వారి గమ్య స్థానాలకు పంపించే ఏర్పాటు చేశారు. డ్రైవరు నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు.

సీఎం సహాయనిధి సాయం అందజేత

కొవ్వూరు: వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నియోజకవర్గంలోని పది మందికి రూ.8,32,885 మంజూరైనట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం వాటిలో పట్టణానికి చెందిన చెల్లె వెంకటరమణకు మంజూరైన రూ.95,837 చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంతమణి రామకృష్ణ, మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని, కాకర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం కోటసత్తెమ్మ

- నేటి నుంచి 19 వరకూ అమ్మవారి తిరునాళ్లు
- విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న ఆలయ ప్రాంగణం



కోటసత్తెమ్మ వారు



విద్యుత్ కాంతులతో కోటసత్తెమ్మ వారి ఆలయం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారు భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్నారు. శక్తి స్వరూపిణి అయిన కోటసత్తెమ్మపై భక్తులకు అపారమైన భక్తి. అమ్మవారిని కొలిస్తే కోరిన కోర్కెలు నెరవేరతాయని ప్రగాఢ విశ్వాసం. ఏటా ఇక్కడ దేవీ నవరాత్ర మహోత్సవాలతో పాటు డిసెంబర్‌లో అమ్మవారి 'తిరునాళ్లు' వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారి ఆలయానికి ప్రతి ఆది, మంగళవారాల్లో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఏడాది తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు.

తిరునాళ్లకు భారీ ఏర్పాట్లు

కోటసత్తెమ్మ అమ్మవారి తిరునాళ్లు ఈనెల 15 నుంచి 19వరకు ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణం విద్యుత్తు దీపాలంకరణలు, భారీ సెట్టింగులతో దేదీప్యమానంగా దర్శనమిస్తోంది. ఆదివారం ఉదయం ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ దంపతుల కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేయనున్నారు. రోజూ అమ్మవారికి సహస్రనామ పూజలతో పాటు ఉదయం చండీ పారాయణం, సాయంత్రం హోమాలు నిర్వహిస్తారు. 16 ఉదయం 10 గంటలకు గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి, నిడదవోలు నంగాలమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారికి చీర–సారె సమర్పణ, 17 ఉదయం 10 గంటలకు నిడదవోలు ఆర్యవైశ్య వర్తక సంఘం వారిచే చీర–సారె సమర్పణ, 18 ఉదయం 10 గంటలకు అఖిల తెలుగుసేన మహిళా అధ్యక్షురాలు జి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో రాజమండ్రి నుంచి 101 మహిళలతో చీర–సారె, కలశములు, బోనాలతో అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పిస్తారు. 19 గురువారం సాయంత్రం 6 గంటలకు ముమ్మిడివరపు బాల కోటయ్య, బ్రదర్స్ వారిచే సన్నాయిమేళం, తాసాలు, గరగ నృత్యాలు, శ్రీనృత్య ప్రియ డ్యాన్స్ అకాడమి ఖండవల్లి వారిచే కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన, పిప్పర వారిచే కేరళ చండా మేళం, రావిమెట్ల రాంగోను మణికంఠ ఈవెంట్స్ వారిచే కాళికా డ్యాన్స్‌తో పాటు మహిళల కోటాలు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు



ఈ ఏడాది కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగే తిరునాళ్లకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. భక్తులంతా ప్రశాంత వాతావరణంలో దర్శించుకునేలా చర్యలు తీసుకున్నాం.

– వి.హరిసూర్యప్రకాశ్, అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ, తిమ్మరాజుపాలెం

సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం



పెరవలి మండలం ఖండవల్లి సాగునీటి సంఘ సభ్యులు



యర్నగూడెం జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దేవరపల్లి తహసీల్దార్ రాజ్యలక్ష్మి

నిడదవోలు రూరల్: మండలంలోని మూడు మేజర్, ఆరు మైనర్ నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తెలిపారు. పెండ్యాల నీటిసంఘం అధ్యక్షుడిగా పుల్లా ఆదిశేఖర్, ఉపాధ్యక్షురాలిగా పి.లక్ష్మీకుమారి, నిడదవోలు నీటిసంఘం అధ్యక్షుడిగా పెన్మత్స ప్రవీణ్‌వర్మ, ఉపాధ్యక్షుడిగా దాసం నారాయణరావు, శెట్టిపేట నీటిసంఘం అధ్యక్షుడిగా పాటంశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా అరసాల సుబ్బారావు, కోరుమామిడి సుబ్బయ్య కాలువ నీటిసంఘం అధ్యక్షుడిగా దొమ్మేటి రామచంద్రరావు, ఉపాధ్యక్షుడిగా అంబటి వెంకట్రావు, కోరుమామిడి రాయుడు చెర్వు నీటిసంఘం అధ్యక్షుడిగా వెంపాటి సత్యనారాయణ, ఉపాధ్యక్షురాలిగా యంత్రప్రగడ నాగసుశీల, కోరుమామిడి ఓటీ చెర్వు నీటి సంఘం అధ్యక్షురాలిగా బస్వా సుజాత, ఉపాధ్యక్షుడిగా వెంపాటి సత్యనారాయణ, తాడిమళ్ల ఆవ, గోపన్న చెర్వు నీటిసంఘం అధ్యక్షుడిగా కొప్పుల నాగవెంకట శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మేకా సత్యనారాయణ, రావిమెట్ల పిల్లకాలువ నీటిసంఘం అధ్యక్షుడిగా కారింకి భగవాన్, ఉపాధ్యక్షుడిగా యామన అయ్యవారు, ఎర్రకాలువ నీటి సంఘం అధ్యక్షుడిగా సూరపని గణేశ్వరరావు, మల్లిన నాగ వెంకటరామారావుతో పాటు సభ్యులు ఎన్నికయ్యారు.

నల్లజర్ల: మండలంలోని ఏడు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయినట్టు తహసీల్దార్ పి.కృష్ణారావు తెలిపారు. ఎన్నికైన సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల పేర్లను ఆయన వెల్లడించారు.పోతవరం సీతమ్మావ చెరువుకు అధ్యక్షుడిగా మండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గాది రామారావు, మారెళ్ళమూడి వీరమ్మ చెరువుకు అల్లూరి రాధాకృష్ణ, మానుకొండ ధర్మారావు, నల్లజర్ల నల్ల–ఎర్రచెరువుకు పేరం శ్రీనివాస్, ముత్తిన సత్యనారాయణ, ప్రకాశరావుపాలెం కంబాలమ్మ చెరువుకు అప్పసాని సూర్యచంద్రరావు, పేరం కృష్ణ, గుండేపల్లి సప్లయి చానల్‌కు ఉన్నమట్ల శ్రీనివాసరావు, ఆలపాటి శివరామకృష్ణ, తెలికిచెర్ల పెద్దచెరువుకు వంకిన వెంకట రామ మోహనరావు, మేకా రామకృష్ణ, అనంతపల్లి సప్లయి చానల్‌కు చింతా ఏసుబాబు,గగ్గర మీరా శ్రీనుబాబు ఎంపికైనట్టు వివరించారు.

పెరవలి: మండలంలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మండలంలో కానూరు, పెరవలి, ఖండవల్లి నీటి సంఘాలు ఉన్నాయి. వీటిలో కానూరు నీటి సంఘం ప్రెసిడెంట్‌గా జుజ్జవరపు వెంకట సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్‌గా అంగర గణేశ్వరరావు ఎన్నికయ్యారు. పెరవలి నీటిసంఘ ప్రెసిడెంట్‌గా గుణ్ణం పట్టాభి, వైస్ ప్రెసిడెంట్‌గా నాగిరెడ్డి నాగేశ్వరరావు, ఖండవల్లి నీటి సంఘం ప్రెసిడెంట్‌గా అడ్డగర్ల శ్రీరామమూర్తి, వైస్ ప్రెసిడెంట్‌గా చిన్నం వెంకట రామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సీహెచ్ వెంకటరమణ, ఘంటా శ్రీనివాస్, సన్నిబాబు వ్యవహరించారు.

దేవరపల్లి మండలం

దేవరపల్లి: మండలంలోని ఐదు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయినట్టు తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. యర్నగూడెం గండి చెరువు నీటి సంఘం అధ్యక్షుడిగా పుట్టా రామారావు, ఉపాధ్యక్షుడిగా కారుమంచి వెంకటేశ్వరరావు, నలుగురు డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యాదవోలు కనకమ్మ చెరువు నీటి సంఘం అధ్యక్షుడిగా వీరిశెట్టి శివరామకృష్ణ, ఉపాధ్యక్షురాలిగా పరిమి పద్మ, నలుగురు డైరెక్టర్లు ఎన్నికయ్యారు. దుద్దుకూరు ఊర చెరువు నీటిసంఘం అధ్యక్షుడిగా పాపోలు లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడిగా కొడవలి శ్రీను, నలుగురు డైరెక్టర్లు ఎన్నికయ్యారు. త్యాజంపూడి ఆవ చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా కొమ్మరెడ్డి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కొయ్యలమూడి బుల్లెబ్బాయి, నలుగురు డైరెక్టర్లు ఎన్నికయ్యారు. సంగాయగూడెం నీటి సంఘం అధ్యక్షుడిగా కరుటూరి విష్ణుమూర్తి, ఉపాధ్యక్షుడిగా ఆచంట శేషారావు, నలుగురు డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గోపాలపురం: మండలంలోని 11 నీటి సంఘాల ఎన్నికలూ ఏకగ్రీవం అయినట్టు తహసీల్దార్ కె.అజయ్‌బాబు తెలిపారు. కరిచర్లగూడెం సప్లై చానల్‌కు జగన్నాథపురానికి చెందిన కోడూరి రఘురాం, భీమోలుకు వింటి యోగేంద్రప్రసాద్, గోపాలపురానికి కుందుల నారాయణరావు, నందిగూడెంకు గంగుల దుర్గారావు, కరిచర్లగూడేనికి వేముల కృష్ణమూర్తి, గుడ్డిగూడేనికి గంగ్రోతు రామకృష్ణ, భీమోలు–2కు కోడి సత్యనారాయణ, గంగోలుకు మాండలీక నాగవెంకటకృష్ణ, రాజంపాలేనికి ఏసురాక సుబ్బారావు, కొవ్వూరుపాడుకు పసుపులేటి వీరాస్వామి నీటి సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తహసీల్దార్, ఇరిగేషన్ అధికారి కేవీ భాస్కరరావు తెలిపారు.

ఉండ్రాజవరం: మండలంలోని సత్యవాడ, పసలపూడి, వేలివెన్ను, ఉండ్రాజవరం నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపారు. వేలివెన్ను సంఘానికి అధ్యక్షుడిగా బూరుగుపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా బి.వెంకట రవితేజ, ఉండ్రాజవరం సంఘానికి అధ్యక్షుడిగా పి.సత్యవెంకట రామదాసు, ఉపాధ్యక్షుడిగా కంటిపూడి రాంబాబు, సత్యవాడ నీటి సంఘాధ్యక్షుడిగా కె.వీర్రాజు, ఉపాధ్యక్షుడిగా సి.నాగేశ్వరరావు, పసలపూడి సంఘాధ్యక్షుడిగా బలుసు వెంకటరత్నం, ఉపాధ్యక్షుడిగా ఎం.శ్రీనుతో పాటు నాలుగు సంఘాల మీద 48 సభ్యులు ఎన్నికయ్యారని తెలిపారు.

మొత్తం కూటమి నేతల కనుసన్నల్లోనే..

- ఏకపక్షంగా సాగునీటి సంఘాల ఎన్నికలు
- విపక్షాలకు ఓటరు జాబితాలు అందకుండా జాగ్రత్తలు
- గేట్లు మూసివేసి ఎన్నికల నిర్వహణ



గేట్లు మూసివేసిన పెరవలి పోలింగ్ కేంద్రం



పెరవలి పోలింగ్ కేంద్రంలో కూటమి నేతలు

పెరవలి: పేరుకే ఎన్నికలు. సాగునీటి సంఘాల పదవులన్నీ తమకే దక్కేలా కూటమి నేతలు చక్రం తిప్పారు. అధికారులు కూడా వారు చెప్పినట్టుగానే ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి కథ నడిపించారు. ఫలితంగా శనివారం నిర్వహించిన పెరవలి మండలంలోని కానూరు, పెరవలి, ఖండవల్లి నీటి సంఘాలు మూడూ ఏకగ్రీవం అయ్యాయి. ఎన్నికల కేంద్రాల వద్ద కేవలం కూటమి నాయకులు తప్ప రైతులు కానీ, పోటీ చేసే అభ్యర్థులు గాని కనిపించకుండా ఏర్పాట్లు చేసుకున్నారు. ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం అధికారులు, కూటమి నేతలు అభ్యర్థులను ఖరారు చేసి నామినేషన్లు వేయించారు. ఏ నీటి సంఘానికి ఎవరు ప్రెసిడెంట్, ఎవరు వైస్ ప్రెసిడెంట్ అనేది ముందుగానే ఖరారు చేసుకుని, అందుకు అనుగుణంగానే నామినేషన్లు వేయించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కేవలం కూటమి నేతలు, నామినేషన్లు వేయాల్సిన రైతులు తప్ప మరొకరి జాడలేదు. ప్రత్యర్థులు ఎవరూ ఈ ఎన్నికల్లో పోటీ చేయకుండా కూటమి నేతలు, అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారు. పెరవలి పోలింగ్ కేంద్రం వద్ద గేట్లు మూసివేసి ఎన్నికలు నిర్వహించారంటే ఎన్నికలు ఎంత సజావుగా సాగాయో పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సాగునీటి సంఘాల ఓటరు జాబితాలు విపక్ష నేతల చేతికి చేరకుండా కూటమి నేతలు అధికారులను మేనేజ్ చేశారు. అన్నింటికంటే ముఖ్యంగా ఈ ఎన్నికల గురించి ఓటర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించలేదు. పత్రికా ప్రతినిధులకు కూడ పూర్తి సమాచారం ఇవ్వలేదు. పెరవలి మండలానికి ఎన్నికలు నిర్వహణకు వచ్చిన అధికారులు కేవలం ప్రేక్షకపాత్ర పోషించారు. ఇలా నిబంధనలు పాటించకుండా సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించే కంటే నామినేటెడ్‌గా ఈ పదవులను అస్మదీయులకు కేటాయిస్తే మంచిదని పలువురు పేర్కొంటున్నారు. పెరవలి పోలింగ్ కేంద్రం వద్ద గేట్లు మూసివేసి ఉన్నాయి. ఇక్కడ ఎన్నికలు జరుగుతున్నాయంటే చుట్టుపక్కల ఉన్న వారు ఎవరూ నమ్మేలా వాతావరణం లేదు. తీరా లోపలకి వెళ్ళి చూస్తే పోలింగ్ కేంద్రంలో కూటమి నేతలు, అధికారులు కనిపిస్తున్నారు. ఇదేమిటి గేట్లు మూసివేసి ఎన్నికలు నిర్వహిస్తున్నారని పోలీసులను అడిగితే తహసీల్దార్ గేట్లు మూసివేయాలని ఆదేశించారని బదులిచ్చారు. దీనిపై పెరవలి తహసీల్దార్ డి.అచ్యుత కుమారిని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించింది. ఎన్నికల్లో ఓటర్లు 9 గంటలకే పోలింగ్ కేంద్రాలకు రావాలని, షెడ్యూల్ ప్రకారంగానే గేట్లువేసి ఉంటారని సమాధానం చెప్పారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

దేవరపల్లి: దీర్ఘకాల విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. దేవరపల్లి సబ్‌స్టేషన్‌కు అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన చిలకా వెంకట్రావు సమస్యలపై దృష్టి పెట్టారు.దేవరపల్లిలో రెండో నూతన టౌన్ ఫీడర్ నిర్మాణం, బందపురం, రంగరాయ కాలనీ, లక్ష్మీపురం, జగనన్న కాలనీలకు 24 గంటలూ సరఫరా ఉండేలా టౌన్ ఫీడర్ నిర్మాణ పనులు చేపట్టారు. టౌన్ ఫీడర్ల పనులు దాదాపు పూర్తికావడంతో వ్యవసాయ రంగానికి ఇస్తున్న విద్యుత్ సరఫరాలో తరచూ ఏర్పడుతున్న అంతరాయంపై దృష్టి పెట్టారు. భారీ వర్షాలకు, ఈదురు గాలులకు పొలాల్లోని విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. దాదాపు 40 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ లైన్లు కావడంతో తీగలు సాగిపోయి నేలకు నాలుగు అడుగుల ఎత్తున వేలాడుతున్నాయి. పలు గ్రామాల్లో తీగలు నేలపైనే వేలాడుతుండడంతో ప్రమాదాలకు గురై అనేక మంది మృతి చెందిన ఘటనలున్నాయి. దీంతో రైతుల విజ్ఞప్తి మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు పర్యవేక్షణలో ఏఈ సీహెచ్ వెంకట్రావు పొలాల్లో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను నిలబెట్టి, వేలాడుతున్న తీగలను సరి చేస్తున్నారు. ఆదివారం పల్లంట్ల సబ్‌స్టేషన్ పరిధిలోని పల్లంట్ల, దేవరపల్లి గ్రామాల మధ్య గల పొలాల్లోని విద్యుత్ స్తంభాలను నిలబెట్టి తీగలను సరి చేసినట్టు ఆయన తెలిపారు. టౌన్‌ఫీడర్ల నిర్మాణ పనులు మరొక నాలుగు రోజుల్లో పూర్తవుతాయని తెలిపారు. దుద్దుకూరుకు కూడా టౌన్ ఫీడర్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి 10 త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. టౌన్‌ఫీడర్ల ఏర్పాటు వల్ల గ్రామాల్లో మంచినీటి సమస్యకు చెక్ పెట్టవచ్చన్నారు. బందపురం, రంగరాయ కాలనీ, లక్ష్మీపురం, జగనన్న కాలనీ, దుద్దుకూరు గ్రా మాలు వ్యవసాయ ఫీడర్లపై ఉన్నాయని, దీని వల్ల తరచూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నా రు. పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడడం వల్ల ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, లారీల వంటి వాహనాలకు తీగలు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఏప్రిల్ నెలాఖరుకు పనులు పూర్తి చేయనున్నట్టు ఆయన తెలిపారు.

మెగా లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



కొవ్వూరులో కక్షిదారులను విచారిస్తున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి అనురాధ



నిడదవోలులో కేసులను పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రామకృష్ణ

కొవ్వూరు: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం కొవ్వూరు కోర్టులో నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో 319 కేసులు పరిష్కారం అయినట్టు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ తెలిపారు. ఐదు బెంచ్‌లు ఏర్పాటు చేసి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించామన్నారు. ఒకటో బెంచ్‌కు తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ, న్యాయవాదిగా ఎండీవీ ప్రసాద్, రెండో బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, మూడో బెంచ్‌కు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, నాలుగో బెంచ్‌కు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జీబీటీఎస్ దేవి, ఐదో బెంచ్‌కు సెకండ్ అడిషనల్ అండ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి అధ్యక్షతన కక్షిదారులను విచారించి కేసులను పరిష్కరించినట్టు వివరించారు. సివిల్ కేసులు 68, క్రిమినల్ కేసులు 251 పరిష్కారం అయ్యాయన్నారు. వాటి ద్వారా కక్షిదారులకు రూ.2,80,86,250 చెల్లించేలా రాజీ కుదిరినట్టు తెలిపారు.

నిడదవోలులో 70 కేసులు

నిడదవోలు: జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కక్షిదారులు కేసులను పరిష్కరించుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ సూచించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి జి.రామకృష్ణ మొత్తం 70 కేసులను పరిష్కరించారు. దీనిలో సివిల్ కేసులు 4, క్రిమినల్ కేసులు 43, మనోవర్తి కేసులు 5, ఎస్‌టీసీ కేసులు 2, ఎక్సైజ్ కేసులు 16 ఉన్నాయి. ఈ కేసుల పరిష్కారంతో కక్షిదారులకు రూ.11.03 లక్షలు అందించారు. న్యాయవాదులు, పోలీస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ జయంతి వేడుకలు

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల సెంటర్లోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ముండ్రు ప్రసాదరావు, జయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో హనుమత్ వ్రతం నిర్వహించారు. భక్తులతో సామూహిక వ్రతాలు చేయించారు.నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ ప్రసాదరావు తెలిపారు. వివిధ గ్రామాల భజనమండళ్ల ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన చేస్తున్నారు.

చాగల్లు: స్థానిక ప్రధాన సెంటర్లోని భక్తాంజనేయ ఆలయం వద్ద హనుమద్ వ్రత మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండోరోజైన శనివారం 1108 నిమ్మకాయలతో సహస్ర నింబ ఫలార్చన జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు భక్తాంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



దూబచర్ల భక్తాంజనేయ స్వామి ఆలయంలో భక్తుల భజన

గోదావరి నదికి మహా నీరాజనం



కొవ్వూరులో గోదావరి నదికి నీరాజనం సమర్పిస్తున్న పండితులు

కొవ్వూరు: మార్గశిర పౌర్ణమి సందర్భంగా స్థానిక గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి నదికి శనివారం సాయంత్రం మహా నీరాజనం సమర్పించారు. ముందుగా గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు దంపతుల చేతుల మీదుగా పూజలు నిర్వహించారు. ఇనగంటి ఉమా రామారావు, పలువురు స్థానిక భక్తులు నీరాజనం కార్యక్రమంలో పాల్గొన్నారు.గోదావరి నదికి వివిధ రకాల హారతులు సమర్పించారు.

అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలకు రీనారాయ్



రీనారాయ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రుద్ర, అధ్యాపకులు

నిడదవోలు: స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా కళాశాల ఫస్టియర్ విద్యార్థిని రీనారాయ్ అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ డి.రుద్ర తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర్ కళాశాలల ఖోఖో పోటీలు ఈనెల 12,13 తేదీల్లో దెందులూరు మండలంలోని గోపన్నపాలెం బీపీఈడీ కళాశాలలో నిర్వహించారు. స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా కళాశాల ఖోఖో జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన రీనారాయ్ అత్యంత ప్రతిభ కనబరిచింది. ఈ క్రమంలో ఆమెను త్వరలో నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీల్లో పాల్గొనే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపిక చేశారు. రీనారాయ్‌ను శనివారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ రుద్ర, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. కంబయ్య, ఫిజికల్ డైరెక్టర్ గౌరి అనూష అభినందించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు: పట్టణానికి చెందిన గౌతమీనగర్‌కి చెందిన ఈడూరి సాయికిరణ్ అనే వ్యక్తి గత నెల 29 నుంచి కనిపించడం లేదని ఆయన తండ్రి కుప్పుస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివా రం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాశ్ తెలిపారు.రాజమహేంద్రవరం వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి ఇంత వరకూ తిరిగి రాలేదని పేర్కొన్నారు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వస్తోందని, పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో అతడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు తెలిసిన వారు 94407 96622 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.